www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 మార్చి 2025
5
చిత్తూరు

వీఆర్ఓలు బాధ్యతగా విధులు నిర్వర్తించండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజల నుండి అందిన రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలని ఈ విషయంలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జి. విద్యాధరి వీఆర్వోలను హెచ్చరించారు. బుధవారం ఐరాల మండల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా రెవెన్యూ సమస్యల పరిష్కారం నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి రావడం జరుగుతుందని, సమస్యల నిమిత్తం వచ్చే ప్రజలతో సావధానంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని నిర్ణీత గడువు లోపల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో అందిన అర్జీలు, ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలని సకాలంలో పరిష్కారానికి తహశీల్దార్‌కి సహకరించాలన్నారు. పిటీషనర్‌కి నోటీసు ఇచ్చిన సమయంలో కనపరిచిన తేదీనే విచారణకు హాజరు కావాలని అర్జీదారులను తెప్పించుకోరాదని సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదని ఈ విషయంలో ఎటువంటి అలసత్వం వహించిన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ప్రజలకు అందజేయాలన్నారు. అర్జీల పరిష్కారానికి సంబంధించి ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల స్పందన తెలుసుకోవడం జరుగుతున్నదని ఈ స్పందనలో వాళ్ల అడిగే ప్రశ్నలకు అర్జీదారులు చెప్పే సమాధానంలో ఎటువంటి నెగటివ్ ఫీడ్ బ్యాక్ తెలిపిన ఆ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలతో సహా జిల్లాలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈవిషయాలన్నింటినీ పరిగణనలోనికి తీసుకొని బాధ్యతాయుతంగా పారదర్శకంగా పనిచేయాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని విఆర్ఓలను హెచ్చరించారు.

అంగన్వాడీ, పీహెచ్‌సీలపై

యాప్‌ల భారం

- కుప్పంలో పైలెట్ ప్రాజెక్టు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇప్పటికే ఉన్న యాప్‌ల గోలతో విధులు నిర్వహించలేకపోతున్నాం..బాబోయ్ అంటూ అంగన్వాడీలు, ఆశాలు, ఉపాధ్యాయులు వాపోతున్న తరుణంలో పైలెట్ ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వం థర్డ్‌పార్టీ సేవలను అంగన్వాడీ కార్యకర్తలు, పిహెచ్‌సి డాక్టర్లు, ఆశాలపై రుద్దనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివిధ రకాల యాప్‌లతో అల్లాడుతున్న కుప్పం అంగన్వాడీ, ఆశాలపై అదనపు యాప్‌లు మరింత భారంగా మారనున్నాయి.

పీహెచ్‌సీలో టాటా సంస్థ సేవలు

కుప్పం నియోజవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై టాటా సంస్థ ద్వారా కొత్త యాప్‌ల ద్వారా వైద్యసేవలను పర్యవేక్షించనున్నారు. టాటా సంస్థ ఇప్పటికే కోలార్, ఒరిసా ప్రాంతాలో పైలెట్ ప్రాజెక్టులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రులను కూడా టాటా సంస్థకు పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించనుంది. కుప్పం నియోజవర్గ పరిధిలో 13 పీహెచ్‌సీలున్నాయి. ముందుగా టాటా సంస్థ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య వారికున్న జబ్బులను సమగ్ర సర్వే ద్వారా గుర్తిస్తుంది. ఈ డేటా యాప్‌లో పొందుపరుస్తారు. ఇలా సర్వే నిర్వహించేందుకు టాటా సంస్థకు రూ.5కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజురు చేసింది. జూన్ ఒకటో తేదీ నాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో మొట్టమొదటగా కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించి ఫలితాలను బట్టి జిల్లా వ్యాప్తంగా అమలు చేయనుంది. కుప్పం ఏరియాలో ఉన్న 13 పిహెచ్‌సిలలో వీటిలో వైద్య నిపుణులతో టెలీకన్సల్టెన్సీ, ఆన్‌లైన్ రికార్డుల నిర్వహణ, రెఫరల్ విధానం, మేనేజర్లు ఏర్పాటు, కాల్ సెంటర్ల ఏర్పాటు, కొత్త యాప్ తయారు చేయనున్నారు. క్రమంగా జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలలో ఈ ప్రాజెక్ట్ అమలులోకి రానుంది.



అంగన్వాడీలపై అదనపు భారం

ఇప్పటికే ఉన్న యాప్‌లతో అల్లాడుతున్న అంగన్వాడీలపై పైలెట్ ప్రాజెక్టు పేరిట అదనపు భారం పడనుంది. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో పనిచేస్తున్న అంగన్వాడీలపై పైలెట్ ప్రాజెక్టు పేరిల అదనపు యాపులతో ఒత్తిడి పెరగనుంది. కుప్పంలో 250 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 21వేల మంది చిన్నారులు ఉన్నారని, కేర్ అండ్ గ్రో అనే ప్రత్యేక ఏజెన్సీ ద్వారా ప్రత్యేక శిక్షణ, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, వయసును బట్టి పొడవు, తదితర అంశాలపై శిక్షణ, పిల్లల తల్లిదండ్రులతో అంగన్వాడీ సిబ్బంది సమన్వయం కార్యక్రమాల నిర్వహణకు రూ.2.90 కోట్లు ఖర్చు చేయనున్నారు., ప్రతి చిన్నారిపై రూ.1,300లు ఖర్చు పెట్టనున్నారు. ఏప్రిల్ 2025 నుండి కుప్పం అంగన్వాడీ కేంద్రాల్లో ఈ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం కానుంది. పైలెట్ ప్రాజెక్టులు, అదనపు యాప్‌లతో పనిభారం పెరుగుతున్నా జీతం పెంచుతారా... అంటే అదేంలేదంటూ అంగన్వాడీలు, ఆశాలు వాపోతున్నారు.

అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలి

- షకిల, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్

ఇప్పటికే వివిధ రకాల యాప్‌ల పేరుతో అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాం. పోషణాట్రాక్, పోషణ పక్వాడ ఇలా అనేక యాప్‌లో పిల్లలు, గర్భవతులు, బాలింత పేర్లు నమోదు చేయాలి. కుప్పంలో పైలెట్ ప్రాజెక్టు పేరుతో అదనపు కొత్త యాప్‌లో నమోదు చేయడం అదనపు భారమే.. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలి.

పారదర్శకంగా ఉపాధి సిబ్బంది బదిలీలు

జిల్లా వ్యాప్తంగా 97 మంది
ఉపాధి హామీ పథక సంచాలకులు
రవికుమార్

జిల్లా ఉపాధి సిబ్బందికి బదిలీ కౌన్సిలింగ్ చేయబడుతున్న పీడీ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): చిత్తూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థలో ఉపాధి సిబ్బందికి బదిలీలను పారదర్శకంగా చేపట్టినట్లు చిత్తూరు జిల్లా ఉపాధి హామీ పథక సంచాలకులు రవికుమార్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ఉపాధి హామీ కమిషనర్ ఆదేశాల మేరకు మేరకు జిల్లాలోని 31 మండలాలకు సంబంధించి ఉపాధి పథకంలో పనిచేసే సిబ్బందికి బదిలీల ప్రక్రియను నిర్వహించారు. ఇందులో ప్రభుత్వం నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాలు ఒకే చోట పనిచేసి ఉంటే బదిలీ తప్పనిసరి, ఐదు సంవత్సరాలు ఒకే చోట పని చేసిన వారిని క్లస్టర్ మార్పు అలాగే సొంత మండలంలో విధులు నిర్వహిస్తున్న వారికి బదిలీ తప్పనిసరి అని అన్నారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధి సిబ్బంది బదిలీల కౌన్సిలింగ్ కమిటీలో చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారిని, చిత్తూరు జిల్లా ఉపాధి పథక సంచాలకులు పర్యవేక్షణలో కౌన్సిలింగ్ చేపట్టారు. జిల్లాలోని 31 మండలాల్లో సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఉపాధి సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో మొత్తం 97మంది ఉపాధి హామీ సిబ్బందికి వివిధ మండలాలకు బదిలీలు చేపట్టడం జరిగింది. బదిలీ అయిన వారిలో ఏపీవోలు 10మంది, బంగారుపాళ్యం మండలంకు ఎస్.బాబిత, ఐరాల మండలంకు జాహ్నవి, కార్వేటినగరంకు కిరణ్ కుమార్, నగరికి దినకర్ బాబు, పులిచెర్లకు సౌభాగ్యవతి, పూతలపట్టుకు ఇందు, సోమలకు సౌకత్ అలీ, వెదురుకుప్పంకు మీనా కుమారి, విజయపురంకు దానయ్య, యాదమరి మండలంకు శోభారాణిను బదిలీ చేశారు. అలాగే జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 8మంది వివిధ మండలాలకు బదిలీ అయ్యారు. టెక్నికల్ అసిస్టెంట్లు 42 మంది, సిఓలు 35 మంది, ఎంపీసీ ఒకరు, ఏపీడి ఒకరు, వారు కోరుకున్న మండలాలకు ప్రభుత్వం ఇచ్చింది నిబంధన మేరకు బదిలీల ప్రక్రియను చేపట్టినట్టు తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా మార్చి 17 నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలలో భాగంగా బుధవారం ఐరాల మండలం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ విద్యాధరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో మార్చి 17 నుండి ప్రారంభమైన పరీక్షల నిర్వహణ ఏప్రిల్ 01 వరకు పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలలో దాదాపు 21 వేల మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. వేసవి కాలంను దృష్టి ఉంచుకుని విద్యార్థులకు తాగునీటి వసతితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్ అందుబాటులో ఉంచి వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 భారత న్యాయసంహిత నియమాలు వర్తిస్తాయని తెలిపారు. కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు పరీక్షాకేంద్రానికి అర్ధగంట ముందుగానే చేరుకోవాలని, హడావిడి లేకుండా ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చునని సూచించారు. ఇన్చార్జి కలెక్టర్ వెంట ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభం

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కడా పీడీ, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్

ప్రజాశక్తి - రామకుప్పం: స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏపీ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్.మునిరత్నం, కుప్పం కడ అధికారి వికాస్‌మర్మత్, ఈమాస్ ఆసుపత్రి డైరెక్టర్ జాకబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి వారి సౌజన్యంతో కంటి సమస్యలు ఉన్నవారికి అధునాతన పరికరాలతో కంటి వైద్య చికిత్సలు అందించవచ్చున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కంటి రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చున్నారు. అనంతరం గురుకుల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణంను కుప్పం కడ ప్రాజెక్టు అధికారి వికాస్ మర్మత్ పరిశీలించారు. పనులను నాణ్యతతో నిర్మించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్, ఆనందరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, సీతాపతి పాల్గొన్నారు.

కేజీబీవీలో ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: కేజీబీవీలలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అడిషనల్ పాజెక్టు కో ఆర్డినేటర్ ఎం.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కేజీబీవీ ఎస్ఓ స్వరూప బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కమనపల్లి కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6,11 తరగతుల్లో బాలికల ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 7,8, 9,10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్లైన్ దరఖాస్తులను మార్చి 22 నుండి ఏప్రిల్ 11 వరకు స్వీకరించబడునని పేర్కొన్నారు. అనాధలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిసి బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన ధరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని, సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు అని తెలిపారు. ఏవైనా సందేహాలకు 87905 28647, కమ్మనపల్లి 70751 59996 నంబర్లు సంప్రదించాలని తెలిపారు.

అక్రమంగా మట్టి, కంకర తరలిస్తే కఠిన చర్యలు

- తహశీల్దార్ నాగరాజు

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ నాగరాజు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మట్టి, కంకర తరలిస్తే కఠిన చర్యలు తప్పదని మండల తహశీల్దార్ నాగరాజు అన్నారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా గ్రావెల్, కంకర తరలించి చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే కార్యకలాపాలకు పాల్పడితే ఎవ్వరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వీఆర్వోలు, క్షేత్ర స్థాయిలో మీకు సంబంధించిన గ్రామాల్లో మట్టిని తరలించకుండా అప్రమత్తంగా ఉంటూ అరికట్టాలన్నారు. అనంతరం వీఆర్వోలు మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తులను అడ్డుకుంటే తమపై తిరుగుబాటు చేస్తున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ ఎవ్వరైనా తిరగబడితే వారి వివరాలను డిప్యూటీ తహశీల్దార్‌కు అందించాలని, వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే భూకబ్జాలకు పాల్పడే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వహించి ఇలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా అడ్డుకోవాలని సూచించారు. అనంతరం గత రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులను పరిశీలించి లబ్ధిదారులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ త్యాగరాజు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'అధికారుల అండతోనే భూ ఆక్రమణ'

ప్రజాశక్తి- కుప్పం రూరల్: గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల అండతోనే తమ భూమిని కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కుప్పం మండలం పైపాల్యం గ్రామానికి చెందిన రైతు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తండ్రి దశాబ్దాల కాలం క్రితమే కొంత వ్యవసాయ భూమిని కొనడం జరిగిందని, అయితే గతంలో ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో భాగంగా తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్థానిక రెవెన్యూ సిబ్బంది రీ సర్వే నిర్వహించి తమకు చెందవలసిన భూమిని మిగులు భూమిగా ప్రభుత్వ రికార్డులలో నమోదు చేసి, ఆ భూమిని వేరొకరి పేరు మీద అక్రమంగా నమోదు చేసినట్టు ఆరోపిస్తున్నారు. ఈ భూమి సైతం తమకు భూమి విక్రయించిన వారి పేరు మీద ఉందని, ఈ భూమి తమకే చెందుతుందని, ఈ విషయమై ఇదివరకే జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలవడం జరిగిందని, వారి సూచనల మేరకు కుప్పం ఆర్డీవోని సంప్రదించినట్లు తెలిపారు. ఆయన విచారణ జరుపుతున్న సమయంలో అక్రమణదారులకు సహకరించిన రెవెన్యూ అధికారి తమ తండ్రిని బెదిరిస్తూ తమ పేరుతో ఇప్పటికే ఉన్న భూమిని సైతం వేరొకరి పేరుతో రాయించారని, ఇప్పటికైనా అధికారులను కలవడం మానుకోవాలని బెదిరించినట్టు తెలిపారు. తప్పు చేసిన అధికారి బెదిరింపులకు పాల్పడడంతో తన తండ్రి గుండె నొప్పి తెచ్చుకుని పిఈఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణం విడిచినట్టు తెలిపారు. తమ ఆస్తులు నష్టపోవడానికి తన తండ్రి ప్రాణం పోవడానికి కారకులైన వారిపై తగు విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పాత్రికేయులతో మాట్లాడుతున్న బాధిత రైతు

సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోండి..

గప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గం ప్రజలు సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కడా పీడీ వికాస్‌మర్మత్ పత్రికా ప్రకటన ద్వారా తెలుపగా, టిడిపి నాయకులు కుప్పం టిడిపి కార్యాలయంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కొరకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు పరుస్తున్నట్టు తెలిపారు. ఈ పథకాలు అర్హులకు మాత్రమే అందాలన్న ఉద్దేశంతో నిజమైన లబ్ధిదారుల ఎంపిక కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకోసం గత కొంతకాలంగా రాష్ట్రంలో నూతన దివ్యాంగుల ధ్రువపత్రాల జారీని తాత్కాలికంగా ఆపివేసినట్టు తెలిపారు. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 21, 22 తేదీలలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రెండు రోజులు జరిగే ఈ శిబిరాన్ని స్థానిక విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటిరోజు గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాలకు చెందిన వారికి, రెండవ రోజు కుప్పం పట్టణం, కుప్పం మండల గ్రామీణ ప్రాంతాల వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు, తెల్లరేషన్ కార్డు, కుప్పం నియోజక వర్గానికి సంబందించిన ఆధార్ కార్డు కలిగి ఉన్న వారు అర్హులని, ఈ శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, తెల్లరేషను కార్డు, 4 పాసుపోర్టు సైజు ఫోటోలు, ఇది వరకే ఏదైనా డాక్టరు దగ్గర చికిత్స పొందిన రిపోర్టు తీసుకోని రావాలని సూచించారు. టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్, రాజకుమార్, సత్యేంద్ర శేఖర్, ఎల్లప్ప, అనసూయ, జనసేన నాయకులు నరేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వేలం ద్వారా రూ.9.46 లక్షలు ఆదాయం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం వేలపాట ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, ఈవోఆర్‌డి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, సర్పంచ్ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇందులో గొర్రెల సంతకు రూ.7,52,000లు, ప్రైవేట్ బస్టాండ్ ద్వారా రూ.1,31,000లు, కోళ్ల సంత ద్వారా రూ.63,000లు హెచ్చుపాటదారులు సొంత చేసుకున్నట్లు తెలిపారు. ఈ వేలంపాట ద్వారా రూ.9,46,000లు పంచాయతీకి ఆదాయం చేకూరిందని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఘనసత్కారం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపల్ కౌన్సిల్‌కు ఏకగ్రీవంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిల్ న్యాయవాది ఏ.మునిరాజు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా తనకి పదవి రావడానికి సహకరించిన పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికీ మున్సిపల్ కౌన్సిల్‌కు ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధించిన కేసుల విజయానికి తను వంతు కృషిచేసి చేస్తానని పేర్కొన్నారు.

నీటి సమస్య లేకుండా చేస్తాం: కమిషనర్

ప్రజాశక్తి -పలమనేరు: మున్సిపల్ పరిధిలో వేసవికాలంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి సమస్య లేకుండా చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి తెలియజేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు పలమనేరు సమీపంలోని నాగమంగళం గల నీటి పంపు హౌస్‌ను, నీటిబోర్లలో నీటి సామర్థ్యంను కమిషనర్ పరిశీలించారు. అవసరమైతే అదనపు బోర్లను లేదా ఉన్న బోర్లలోని నీటి సామర్థ్యతను బట్టి రీబోర్ వేయించి వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకున్నట్లు సంబంధిత అధికారులకు తెలియజేశారు.

పార్కింగ్ వేలం ద్వారా

రూ.2.12 కోట్లు ఆదాయం

వేలంపాటలో మాట్లాడుతున్న కుసుమకుమారి

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం గ్రామపంచాయతీ పరిధిలో 2025-26 సంవత్సరానికి గాను పంచాయతీ, దేవస్థానం వారు సంయుక్తంగా నిర్వహించిన పార్కింగ్ ఫీజు వేలంలో రెండు కోట్ల పన్నెండు లక్షలతో కాణిపాకంకి చెందిన ఆర్.సెల్వం హెచ్చు పాటదారునిగా నిలిచారని ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి కుసుమ కుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ మొదట సీల్డ్ టెండర్‌లో మొత్తం 9 మంది పాల్గొనగా రెండు అప్లికేషన్లు చెల్లనివి కాగా, మిగిలిన ఏడు అప్లికేషన్‌లో రెండు కోట్ల పన్నెండు లక్షలతో కాణిపాకంకి చెందిన ఆర్.సెల్వం హెచ్చుపాటదారునిగా నిలిచారని తెలిపారు. తదుపరి బహిరంగ వేలంలో ఎవరూ పాల్గొనని కారణంగా సీల్డ్ టెండరులో హెచ్చుపాటదారునిగా నిలిచిన సెల్వం పార్కింగ్ ఫీజు వేలంను దక్కించుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం ద్వారా రూ.31 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి- వీ కోట: మండల కేంద్రమైన వీకోట మేజర్ గ్రామపంచాయతీకి వివిధ మార్కెట్ల వేలంపాటల ద్వారా రూ.31,06,550లు ఆదాయం లభించింది. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ పిఎన్.లక్ష్మి అధ్యక్షతన, ఈవోకేవై శివ శంకరయ్య ఆధ్వర్యంలో 2025 -26 సంవత్సరాలకు గాను ఈ వేలం పాటలు నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని వారపు కూరగాయల సంతను హెచ్చుపాటదారు ఆర్.మనీ స్టాంప్ డ్యూటీతో కలిపి రూ.2,98,700లకు, దినసరి కూరగాయల మార్కెట్‌ను శైలజ రూ.5,25,300లకు, ప్రైవేట్ బస్టాండ్ ఇక్బాల్ రూ.11,03,130లకు, పశువుల సంతను జిఆర్.అరుణ్ కుమార్ రూ.4,53,200లకు, గొర్రెలు మేకలు సంతను జిఆర్.రెడ్డిభార్గవ్ రూ.4,87,190లకు, జంతువధశాలను కే.ఉదయ్ కుమార్ రూ.19,670లకు, కమ్యూనిటీ మరుగుదొడ్లను వై.పవన్ కుమార్ రూ.2,19,360లకు హెచ్చుపాటుదారుగా దక్కించుకున్నారు. వివిధ మార్కెట్లు గుత్తాల ద్వారా గ్రామ పంచాయతీకి రూ.31,06,550లు ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది రూ.1,46,600లు ఆదాయం సమకూరినట్లు వారు తెలిపారు. ఈ వేలం పాటలో పురప్రముఖులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.11.36లక్షల ఆదాయం

ప్రజాశక్తి- చౌడేపల్లి: చౌడేపల్లి పంచాయతీకి వివిధ వనరుల ద్వారా రూ.11,36,700లు ఆదాయంగా సమకూరినట్లు ఈవో ఆఫీస్ కృష్ణవేణి తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించగా వారపు సొంత గిరిబాబు రూ 9.53 లక్షలు, ప్రైవేటు బస్టాండ్‌ను శ్రీరాములు రూ.1.81 లక్షలు, కొబ్బరిచెట్ల ఫలసాయాన్ని మండే భాస్కర్ రూ.2700లకు హెచ్చుగా పాడి వేలం దక్కించుకున్నారన్నారు. వీటన్నింటికీ సంవత్సర కాలపరిమితి ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో ఈనెల 20, 21, 22 తేదీలలో మూడు రోజులపాటు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు పోషణా భీ పడాయి భీపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ నవచేతన కార్యక్రమంలో 0–3 సంవత్సరాలు, ఆధార్ శీలా కింద మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు గల పిల్లలకు లోకాస్ట్ కింద ఏ విధంగా ఆట వస్తువులు తయారు చేసుకోవచ్చు, వారి గ్రోత్ గురించి తెలియజేయడం వంటి పలు రకాల అంశాలపై కేంద్ర ప్రభుత్వం వారిచే ఆన్లైన్ విధానంలో శిక్షణా తరగతులు ఉంటాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన విధానం వల్ల అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా రావడం అక్కడ నేర్పించే పలు అంశాలను వారు నేర్చుకోవడం జరుగుతుందని తెలిపారు.

అదనపు ట్రాన్స్ఫార్మర్కు వినతి

ప్రజాశక్తి- శాంతిపురం: కదిరిముత్తనపల్లి గ్రామంలో నూతనంగా వేసిన బోరుకు అదనపు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి, బోరును ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని గ్రామస్తులు ఎంపీడీవోను కోరారు. ఈ నెల 13,14వ తేదీన కదిరిముత్తనపల్లి గ్రామంలో జరిగిన పెద్దదేవర జాతర సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ తరపున తాగునీరు, వీధి లైట్లు, శానిటేషన్ పనులు చేపట్టి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సమర్ధవంతంగా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసినందులకు కృతజ్ఞతగా ఎంపీడీవోను కలిసి గ్రామస్తులు అభినందించారు. గ్రామ కమిటీ చైర్మెన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఏనుగుల నుండి రక్షణ కల్పించండి

సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని బోడబండ్ల గ్రామంలో ఏనుగుల పంటలపై చేసిన దాడులను సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు బుధవారం పరిశీలించారు ఏనుగుల నుండి రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల దాడుల్లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, ఏనుగుల గుంపు రైతులు పండించిన పంటలను తొక్కి నాశనం చేస్తున్నాయని, రాత్రుల్లో కాపలా ఉన్న రైతులు, పశువులపై దాడులు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యధోరణి కారణంగా పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల వలన రైతులు పంట నష్టపోతున్నారని, ఆర్థికసాయం సైతం సరిగా అందించడం లేదని అన్నారు. అనంతరం సచివాలయంలో రైతులకు పరిహారం అందించాలని వినతిపత్రం ఇచ్చారు. సిపిఐ సీనియర్ నాయకులు కే.మణి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, బి.కుమారి, పి.రఘు, నష్టపోయిన రైతులు పాల్గొన్నారు.

యానాదులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- చౌడేపల్లి: ప్రముఖనటుడు విద్యాదాత మంచు మోహన్ బాబు జన్మదిన వేడుకలు సందర్భంగా ఆయన వీరాభిమాని చింతపర్తి తాతయ్య యానాదులకు దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం గడ్డంవారిపల్లి మార్గంలోని యానాది కాలనీలోని మహిళలకు చీరలు, పిల్లలకు తినుబండారాలు పంపిణీ చేశారు. అనంతరం తిరుపతి సమీపంలోని విద్యానికేతన్కు వెళ్లి మోహన్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీలోని పలు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లుమరమ్మతులకు గురై తాగునీరు వృధా అవుతూ ఉండడంతో వాటిని గుర్తించి వాటి స్థానంలో నూతన పైప్లైన్లు ఏర్పాటు చేయడం మరమ్మతులు చేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి మేనక తెలిపారు. వేసవికాలం ప్రజలకు తాగునీటి ఇబ్బంది రాకూడదన్న సదుద్దేశంతో లీకేజీలున్న పైపులైను గుర్తించి వాటికి మరమ్మతులు చేయడం, అవసరమైన చోట నూతన పైప్ లైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంకెక్కడైనా తాగునీరు వృధా అవుతున్నట్లు ప్రజలు గుర్తిస్తే సమాచారం ఇస్తే వాటిని కూడా బాగు చేయడం జరుగుతుందని తెలిపారు.



తహశీల్దార్ బాబుకు ఘన సన్మానం..

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పంలో విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ కే.బాబు బదిలీ కావడంతో టిడిపి నేతలు ఆయనకు ఘనసన్మానం చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బాబుకు శాలువాలుకప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి ప్రజలకు విశేష సేవలు అందించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో సహాయ సహకారాలు అందించారన్నారు. మునస్వామి, నారాయణ చారి, ఆనందరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, నందా రెడ్డి, సుబ్రీ, విజయ్రెడ్డి, మనోహర్, చంద్రారెడ్డి, రామలింగారెడ్డి, జేయి, సత్తి పాల్గొన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని రేషన్ కార్డు పొంది ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేసుకోవాలని యాదమరి తహశీల్దార్ పార్థసారథి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రేషన్షాపు డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణ డీలర్లు వారి షాప్ పరిధిలోని రేషన్ కార్డుదారులు ప్రతి ఒక్కరికి ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ కేవైసీ చేయని సభ్యులకు ఉచిత బియ్యం అలాట్మెంట్ కాదని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఈనెల 25వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ప్రతి డీలరు విధిగా రోజువారి ఎండియుకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల వారి స్టాక్ రిపోర్టులో నమోదు చేయాలన్నారు. ఎండియు వాహనాలు లేనిచోట తప్పనిసరిగా వీఆర్ఏ లాగిన్లో డీలర్ పంపిణీ చేయాలని తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, రేషన్షాప్ డీలర్లు పాల్గొన్నారు.

రూ.5 లక్షలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని దాసమానపల్లి గ్రామపంచాయతీ, దాసమానపల్లి గ్రామానికి చెందిన ఎన్.చంద్రయ్య జనవరి నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను గతంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో ఇన్సూరెన్స్ డబ్బులు రూ.5లక్షలు మృతుని భార్య సుబ్బమ్మ అకౌంట్లో జమ చేసినట్లు బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు టిఎం.బాబు నాయుడు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ గోవిందు స్వామి, జనరల్ సెక్రెటరీ భాను, మాజీ ఆత్మ చైర్మన్ చంద్ర, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, నాయకులు సుబ్బు, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

రాజశేఖర్ దీక్షితులుకు సన్మానం

ప్రజాశక్తి- చౌడేపల్లి: స్థానిక అభీష్టత మృత్యుంజయశ్వర స్వామి ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితులను వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల కలకత్తాలో ఆయన డాక్టర్ బిరుదు అందుకున్నందుకు గౌరవార్ధకంగా ఘనంగా సన్మానించినట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఇస్సా నాగలక్ష్మి తెలిపారు. క్లబ్ గౌరవాధ్యక్షులు రామ్ కుమార్, అధ్యక్షుడు అన్నం రంగవల్లి, అమరావతి శ్రీనాథ్, సెక్రటరీ లోకేష్, కలపాటి వాణి, అమర్నాథ్ పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

ప్రజాశక్తి- శాంతిపురం: ఎంపీడీవో ఎపిఆర్.కుమార్ శివరామపురం గ్రామపంచాయతీ గట్టు గ్రామంలో ఎన్టిఆర్ హౌసింగ్ పథకం కింది మంజూరై అసంపూర్తిగా ఉన్న గృహాలను పరిశీలించారు. గృహనిర్మాణాలను ఏప్రిల్ నెలాఖరు లోపల పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అదనపు సాయంగా ఎస్సీ, బిసిలకు రూ.50 వేలు, ఎస్టిలకు రూ.75వేలు మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసియున్నారని, దీనితో యూనిట్ విలువ ఎస్సీ బీసీ రూ.2,30,000లు, ఎస్టీలకు రూ.2,55,000లు అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకొని అసంపూర్తిగా ఉన్న గృహాలను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, ఇంజినీరింగ్ సహాయకులు హరిక్రిష్ణ, సంక్షేమ సహాయకులు రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యం

మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాట్సప్ టెక్నాలజీతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలను అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా రెవెన్యూ, విద్యుత్ బిల్లులు, బస్ టికెట్లు, ఎన్టీఆర్ వైద్యసేవలు, దేవాలయ దర్శన టికెట్లు, వివాహ ధృవపత్రాలు తదితర 300 సేవలు వరకు మన మిత్ర వాట్సాప్ ద్వారా కూటమి ప్రభుత్వం త్వరలోనే అందిస్తుందన్నారు. వైసిపి నేతలు టిడిపి నుంచి వస్తున్న మెసేజ్ వాట్సప్ ద్వారా ప్రజల సమాచారాన్ని దారి మళ్ళిస్తున్నారని విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు కూటమి ప్రభుత్వంను ఆదరించి, ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, సీతాపతి, మనోహర్, నాగ భూషణం, రఫీ , రామలింగారెడ్డి, కామరాజు నాయక్, రామకృష్ణప్ప పాల్గొన్నారు.

నూతన బోరుతో తీరిన ప్రజల దాహార్తి

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఆవుల పల్లె పంచాయతీ దేవల కుప్పం గ్రామంలోని 30 కుటుంబాల వారికి ఎన్నో ఏళ్ల తర్వాత నూతన కూటమి ప్రభుత్వంలో త్రాగునీటి సమస్యకు నూతన బోరు వేయడంతో పరిష్కారం అయింది. గ్రామంలో 30 కుటుంబాల వారు నివసిస్తూ ఉండగా ఎప్పటినుండో గ్రామస్తుల సౌకర్యార్థం చేతి బోరు మాత్రం ఉంటూ ప్రజల దాహాన్ని తీరుస్తూ వచ్చింది. ఇంతవరకు గ్రామంలో ప్రజలకు బోర్ వేయడం పైప్ లైన్ ల ద్వారా త్రాగునీటిని అందించడం గాని జరగకపోవడంతో సమస్య గుర్తించిన తెలుగుదేశం పార్టీ నాయకులు వేణు నాయుడు, లక్ష్మీపతి నాయుడు ఇరువురు బుధవారం ఉదయం బోరు లారీని తీసుకువచ్చి డ్రిల్లింగ్ చేయించగా సమృద్ధిగా నీరు పడటంతో అటు గ్రామస్తులు ఇటు నాయకులు ఎంతో ఆనందంతో పొంగి పరవశించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మణికుమార్ను అడుగగా పంచాయతీ నిధులతోనే నూతన బోరు వేయడం జరిగిందని గ్రామస్తులకు త్రాగునీరు అందించేందుకు నీరు పుష్కలంగా పడ్డాయని త్వరలోనే పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి త్రాగునీటిని సరఫరా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న

రెండు ట్రాక్టర్లు, హిటాచి సీజ్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నీవానది వద్ద ఇసుక అక్రమంగా డంపుచేసి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. కొందరు టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రాత్రి వేళల్లో తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయం స్థానికుల ద్వారా మీడియా ప్రతినిధులకు తెలియడంతో నీవానదిలో పొదలు మాటన అక్రమంగా డంప్ చేసిన ఇసుకతో పాటు హిటాచి యంత్రం, అలాగే రెండు ట్రాక్టర్లు ఆ స్థలంలో ఉండడానికి గుర్తించారు. తహసిల్దార్కి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తహసిల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఏకాంబరం కలిసి ఇసుక డంప్ వద్దకు చేరుకుని పరిశీలించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం హిటాచి యంత్రంతో పాటు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్కు తరలించినట్లు తహశీల్దార్ తెలిపారు.

వాల్పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చౌడేపల్లి

మార్చి 23వ తేదీన తిరుపతిలో జరుగనున్న రాయలసీమ మాలల సింహగర్జన బహిరంగ సభకు లక్షల మంది మాల కుటుంబీకులు విచ్చేసి సభను విజయవంతం చేయాలని రాయలసీమ మాలల సింహగర్జన జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ యమాల సుదర్శనం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్లో మండల మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో చలో మాల చలో తిరుపతి వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ భారత రాజ్యాంగం వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా మార్చి 23వ తేదీన తిరుపతిలో లక్షల మంది మాలల కుటుంబీకులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మాలల సింహగర్జన బహిరంగ సభకు రాయలసీమ జిల్లాలోని మాల కుటుంబీకులు తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జేఏసీ కార్యదర్శి పి.ప్రభాకర్, ఉపాధ్యక్షులు ధనశేఖర్, యమల చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్ పాల్గొన్నారు.

24న శ్రీ పద్మావతి అమ్మవారి గజవాహన సేవ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మార్చి 24వ తేదీ గజవాహన సేవ వైభవంగా నిర్వహించినట్లు టీటీడీ చీఫ్ పిఆర్ఓ డాక్టర్ తలారి రవి ఓ ప్రకటనలు తెలిపారు. ప్రతినెలా ఉత్తరాషాఢ నక్షత్రం సందర్భంగా టీటీడీ గజవాహన సేవను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

మృత్యువుతో పోరాడి... అసువులు బాసిన అంగన్వాడీ

- సిఐటియు నేతల నివాళి
- నేటి సాయంత్రం అంత్యక్రియలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)

గత సోమవారం (ఈనెల 10న) నిర్బంధాలను ఎదుర్కొని విజయవాడలో అంగన్వాడీల ఆందోళనకు బయల్దేరి వెళ్లిన అంగన్వాడీ టీచర్ శ్రీవాణి బ్రెయిన్ స్ట్రోక్తో పది రోజులుగా విజయవాడ, తిరుపతిలో వెంటిలీటర్పై చికిత్స పొందిది. మృత్యువుతో పోరాడి బుధవారం తిరుపతిలో మృతిచెందింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలపైన ఆమె స్వగ్రామమైన పిచ్చాటూరులో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

తిరుపతి జిల్లా పిచ్చాటూరు అంగన్వాడి టీచర్ శ్రీవాణి ఈనెల 10న సోమవారం రాష్ట్ర యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు విజయవాడ ధర్నా నిమిత్తం వెళ్లింది. అయితే బ్రెయిన్స్ట్రోక్కు గురై కోమాలోకి చేరుకోవడంతో సహచరులు ఆస్పత్రికి చేర్చారు. తొలుత విజయవాడలో చికిత్స పొందిన ఆమెను తిరుపతి స్విమ్స్కు తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జిబిఎస్ మణ్యం, గౌరవాధ్యక్షురాలు ప్రసాద్రావు, సహచర అంగన్వాడి నాయకులు వెంటిలీటర్పై చికిత్స పొందుతున్న శ్రీవాణిని చూసి, కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలం విజయవాడలోనే ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి, మెరుగైన చికిత్స అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ద్వారా ఫోన్చేయించారు. అయితే పది రోజులుగా శ్రీవాణి శరీరం వైద్యానికి సహకరించకపోవడంతో బుధవారం ఆమె తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆమె మృతికి ఎంఎల్ఏ ఆదిమూలం దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రభుత్వపరంగా రావాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆమె మృతికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు నివాళి అర్పించారు. శ్రీవాణి భర్త లక్ష్మీపతిరాజుతో పాటు కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీవాణికి అంగన్వాడి టీచర్గా ఉంటూనే, స్థానికంగా ఉన్న చుట్టుపక్కల గ్రామాల్లోని చిన్న పిల్లలకు రాత్రివేళల్లో పండరిభజన నేర్పడం అలవాటుగా ఉండేది. ఆమె హఠాన్మరణం పట్ల ఆమె వద్ద భజన నేర్చుకున్న చిన్నారులు, తల్లిదండ్రులు సైతం ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కొడుకు సైతం గతంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబంలో మరోసారి విషాదఛాయలు అలముకున్నాయి.

శ్రీవాణి (ఫైల్ఫొటో)

చంద్రబాబు తిరుమలకు రానున్న సందర్భంగా అడిషినల్ ఈవో అన్నదానసత్రంలో తనిఖీలు

సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 20వ తేదీ తిరుమల పర్యటన సందర్భంగా పోలీసులు సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసామన్నారు. తిరుపతి – తిరుమల పర్యటనకు రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు వస్తున్నారు. ఈ నెల 20న ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుండి తిరుమలకు రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం నుండి తిరుమల శ్రీ పద్మావతి విశ్రాంతి భవనం వరకు కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. రేణిగుంట విమానాశ్రయం నుండి పరిసరాలలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సీఎం పర్యాటన రెండు రోజులు సిబ్బంది ఎక్కడ నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ అధికారులు, నాగభూషణం అదనపు ఎస్పీ క్రైమ్స్, శ్రీనివాసరావు డిఎస్పి రేణిగుంట, రవీంద్రారెడ్డి డి.ఎస్.పి ఆర్మ్డ్ రిజర్వ్ పాల్గొన్నారు.

25న మెట్లోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి 522వ వర్ధంతి ఉత్సవాలు మార్చి 25 నుండి 29వ తేదీ వరకు అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా నిర్వహించనున్నారు. మార్చి 25వ తేదీ ఉదయం 6 గంటలకు తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా జరుగనుంది. మార్చి 26న తిరుమలలో సాయంత్రం 6 గంటలకు నారాయణగిరి ఉద్యాన వనంలో సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహిస్తారు. నాలుగు రోజుల పాటు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద సాయంత్రం వేళ ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

'శ్రీ సాయి సుధా' ఉచిత బిఎండి పరీక్షలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా బియండి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరముల వైద్య నిపుణులు డాక్టర్ బి. సుకుమార్ ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయి వారిచే ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలన్నారు. ఎక్సరే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు. సుమారు 70 మందికి పైగా పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత, సురేంద్ర పాల్గొన్నారు.

మెడికల్ స్టూడెంట్స్తో సమానంగా ఇవ్వాల్సిందే

'దీక్ష'ను కొనసాగిస్తాం : వెటర్నరీ విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మెడికల్ విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ ఇవ్వాలని గత 48 రోజులుగా శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విద్యార్థులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పొదలకూరు, ప్రొద్దుటూరు, గన్నవరం తదితర ప్రాంతాల్లో దీక్షలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్, మంత్రి నారా లోకేష్లను కలిసి తమ గోడు వినిపించారు. పలు దఫాలుగా చర్చలు జరిగాయి. వీరి ఆందోళనకు స్పందించిన ప్రభుత్వం అండర్ గ్రాడ్యుయేట్లకు 7వేల నుంచి 10,500, పీజీ విద్యార్థులకు 9వేల నుంచి 13,500, పిహెచ్డి స్టూడెంట్లకు 10వేల నుంచి 15వేలకు పెంచుతూ జీవో జారీ చేసింది. అయితే తమకు మెడికల్ విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ ఇచ్చేంత వరకూ ఆందోళన విరమించేది లేదని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం, పవన్నాయక్లు 'ప్రజాశక్తి'కి స్పష్టం చేశారు.

అర్హులందరికీ టిడిఆర్ బాండ్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ టిడిఆర్ బాండ్లు ఇచ్చేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని, త్వరలోనే ఇవ్వనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కార్యాలయంలో డిసి, డిసిపి ఆధ్వర్యంలో రెండు నెలలుగా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించి, దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు. ప్రతివారం ఆన్లైన్లోనూ, ప్రత్యక్షంగానూ టిడిఆర్ కమిటీ చర్చిస్తోందన్నారు. ఎక్కువమంది నివాసయోగ్యమైన స్థలాలనున వ్యాపారయోగ్యంగా చూపడంతో టిడిఆర్ బాండ్లు పంపిణీకి ఆలస్యం అవుతోందన్నారు. మొదటి విడత కమిటీ సమావేశంలో తొమ్మిది దరఖాస్తులు రాగా, అందులో అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న ఓ వ్యక్తికి బాండు ఇచ్చామన్నారు. రెండో విడత 30 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి త్వరలోనే లబ్దిదారులకు అందిస్తామన్నారు. ఎటువంటి అపోహలను నమ్మవద్దని కమిషనర్ ఎన్.మౌర్య పేర్కొన్నారు.

DOCUMENT MISSING

I, **Y SANTHA** (Aadhar No. 5074 0390 2734) **W/o Y. KRISHNAIAH** aged about 43 years. Indian Hindu, residing at D.No.5-87, Chenganapalli (V), Errepalli (P), Irala (M) Chittoor Dist. 517130 do hereby solemnly affirm and state as follows. I loss my house original **documnet No.1528/2015** and **Link Document No. 1304/2014** dated on 08-11-2024 while I am painting and cleaning house I searched surrounding area in my house but it vain.

Contact No. 9703406735